క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్ల సందర్శన



సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం కాంటా పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సుజాతనగర్: రెండు రోజుల విజ్ఞాన పర్యటనలో భాగంగా కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భుక్యా రాంబాబు ఆధ్వర్యంలో సూర్యాపేట, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లలో మార్కెట్ కమిటీ సభ్యులు సోమవారం పర్యటించారు. ఆయా మార్కెట్లలో ఈ–నామ్ అమలుతో పాటు మిర్చి, ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. మంగళవారం నిజామాబాద్ మార్కెట్‌ను సందర్శించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సొసైటీ చైర్మన్ వీరహనుమంతరావు, డైరెక్టర్లు బోడా హరినాయక్, బాలాజీ, భూక్యా అమ్మి, బోడా రాములు పాల్గొన్నారు.

పొంగులేటి సభకు తరలిన అభిమానులు



సులానగర్ నుంచి పొంగులేటికి సభకు బయలుదేరుతున్న అభిమానులు

టేకులపల్లి: ఇల్లెందు పట్టణంలో సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొంగులేటి ఆత్మీయ సమ్మేళనానికి టేకులపల్లి నుంచి అధిక సంఖ్యలో అభిమానులు తరలి వెళ్లారు. సులానగర్, టేకులపల్లితో పాటు మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి అభిమానులు తరలి వెళ్లినట్లు అభిమానులు తెలిపారు. వేదికపై పొంగులేటికి టేకులపల్లి అభిమానులు జ్ఞాపికను అందజేశారు. ఎంపీటీసీ బాణోతు పూర్ణ, వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, సర్పంచ్‌లు పూనెం ఉమ, బోడ నిరోషా, మోకాళ్ల రమాదేవి, మాడె మధు తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

పాల్వంచ: పేద విద్యార్థిని చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. సోమవారం స్థానిక రాంనగర్‌కు చెందిన సురకాసుల రత్నమానిక బీటెక్ విద్యనభ్యసిస్తోంది. ఆమె చదువుకు సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. మాట్లాడుతూ... వెంపటి నరసింహారావు, అనసూయమ్మల జ్ఞాపకార్థం పేద విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, గాలి పద్మ, దాసరి లక్ష్మి, నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

చదువులో పోటీతత్వం పెరగాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు పోటీతత్వంతో బాగా చదివి, ఉన్నత స్థానాలను అధిరోహించాలని కేంద్ర ప్రభుత్వ మాజీ ఆరోగ్య శాఖ డైరెక్టర్ జూపాక మహేష్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి మహేష్ సోమవారం పాఠశాలను సందర్శించి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులందరూ కష్టపడే తత్వాన్ని ఇష్టపడాలన్నారు. తల్లిదండ్రులకు, పాఠశాలలకు, పుట్టిన ఊరుకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాను ఉన్నత విద్యనభ్యసించిన కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలపై మమకారంతో పాఠశాలను సందర్శించినట్లు వివరించారు. పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడైన ప్రథమ విద్యార్థిగా తనకు రికార్డు ఉందన్నారు. పాఠశాలనే తన అభివృద్ధికి పునాదులు వేసిందని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో అభ్యుదయ కళా సేవా సమితి జిల్లా అధ్యక్షులు, కవి, సినీగీత రచయిత, గాయకులు, ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, హెచ్‌ఎం.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో క్రీడాపోటీలు

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం హైస్కూల్‌లో రిపబ్లిక్ డే పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం ప్రకాశ్‌రావు జెండాను ఊపి పోటీలు ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చదరంగం, క్యారమ్స్ పోటీలను నిర్వహించడం జరిగిందని, విజేతలకు జనవరి 26న బహుమతులు అందజేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్‌సింగ్, వెంకటేశ్వరరెడ్డి, భవానిదేవి, శాంతి, దుర్గ, శైలజ, మనీ, శ్రీనివాస్, లక్‌పతి, ప్రకాశ్‌కుమార్, వెంకటమ్మ, పీఈటీ మదన్మోహన్ పాల్గొన్నారు.

ఇక ప్రైవేటు స్వచ్ఛ వాహనాలు

- చెత్తకు పన్ను వసూలు షురూ
- ఈ నెల నుంచి నూతన ఏజెన్సీతో అగ్రిమెంట్ అమలులోకి
- ఇల్లెందులో 9,458 గృహాలు.. ఇంటికి రూ.50 వసూలు



చెత్త సేకరిస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది (ఫైల్)

ఇల్లెందు: ఇక మున్సిపాల్టీలో నీటి, ఇంటి, వ్యాపార పన్నులే కాదు ఇక మీదట చెత్తకు పన్ను చెల్లించాల్సిందే.. స్వచ్ఛ మున్సిపాల్టీగా ఉండాలంటే ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనానికి చెత్తను వేరు చేసి వేయాలి. ఇందుకు గాను ప్రతినెల ఇక మీదట రూ.50 చెల్లించాలి. గత డిసెంబర్‌లో టెండర్ పూర్తి చేయగా ఈ జనవరి నెల నుంచి అమలులోకి వచ్చింది. గత వారం రోజులుగా మున్సిపాల్టీలోని వార్డుల్లో ఇంటింటికీ ప్రైవేట్ కాంట్రాక్టర్ సైన్యం బిల్లులు వసూలు కోసం సంచరిస్తోంది. రసీదు బుక్కుతో తామే టెండర్ పొందామంటూ హైదరాబాద్‌కు చెందిన 'ఎక్స్ ఎల్ సాఫ్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' డబ్బులు వసూలుకు వస్తున్నారు. ఇక మీదట ప్రతినెలా 10వ తేదీ లోపు రూ.50 చెల్లించాలని ఇంటి యజమానులకు తెలియజెప్పి వెళ్తున్నారు.

కాంట్రాక్టర్ చేతిలోకి ఇల్లెందు స్వచ్ఛ వాహనాలు..

ఇల్లెందు మున్సిపాల్టీ రెండేళ్ల క్రితం దాదాపు 20 చెత్త వాహనాలు కొనుగోలు చేసింది. పాత వాహనాలు నాలుగుతో పాటు 24 వార్డులకు వాహనాలు కేటాయించి చెత్త సేకరణ చేపట్టింది. ఇందుకు డీజిల్, డ్రైవర్, వర్కర్ల ఖర్చు మున్సిపాల్టీ చెల్లించింది. కానీ ఇక మీదట ఆ వాహనాల మెంటెనెన్స్, డీజిల్, వాహన డ్రైవర్ వేతనం, వర్కర్ వేతనం కూడా ఇంటి యజమానులు వేసే చెత్త నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. వాహనాలు, డ్రైవర్లు, వర్కర్లను టెండర్ పొందిన ఏజెన్సీకి అప్పగించారు. ప్రతినెలా సుమారు 9,458 గృహాల నుంచి రూ.4.72 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

నిన్నటి వరకు ఇలా ఉండేది...

జిల్లాలో మొట్టమొదటిసారి ఇల్లెందు మున్సిపాల్టీలో స్వచ్ఛ వాహనాలతో వార్డుల్లో వినూత్నంగా చెత్త సేకరించారు. ఇందుకోసం వార్డుకు ఒక స్వచ్ఛ వాహనం కొనుగోలు చేశారు. సుమారు రూ. కోటి పైగా నిధులు వెచ్చించి 20 వాహనాలతో ప్రతీ వార్డుకు ఒక వాహనం ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనానికి రూ. 4.80 లక్షలతో ప్రత్యేకంగా తడి, పొడి చెత్తకు వేర్వేరుగా డబ్బాలు అమర్చిన వాహనాలను కొనుగోలు చేశారు. తడి చెత్తకు గ్రీన్ బాక్సు, పొడి చెత్తకు బ్లూ బాక్సు ఏర్పాటు చేశారు. అలాగే ఈ వాహనాలకు మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటూ ఆయా వార్డుల్లో ఇంటింటికి చెత్తను సేకరించుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి 400 గృహాలకు ఒక వాహనం ద్వారా చెత్త సేకరించి తద్వారా స్వచ్ఛ మున్సిపాల్టీగా మార్చాలని పాలకవర్గం నిర్ణయించింది.

అమలులోకి నూతన ఏజెన్సీ..

గత డిసెంబర్‌లో టెండర్ పొందిన హైదరాబాద్‌కు చెందిన ఎక్స్ ఎల్ సాఫ్ట్ టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జనవరి నుంచి ఇల్లెందులో తమ కార్యకలాపాలు అమలు చేస్తోంది. ఇంటింటికి తిరిగి రూ.50 వసూలు చేస్తోంది. పట్టణంలో 9,458 గృహాలు ఉండగా ఒక్కో ఇంటికి రూ.50 వసూలు చేయాలని నిర్ణయించారు.


ఎక్స్ ఎల్ సాఫ్ట్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

ప్రైవేట్ ఏజెన్సీ వారు ఇస్తున్న రశీదు

కాంట్రాక్టర్‌కు అప్పగించాం..



నిన్నటి వరకు పట్టణంలోని చెత్తను మున్సిపాల్టీ సేకరించింది. ఇక మీదట ప్రైవేట్ కాంట్రాక్టర్ సేకరిస్తారు. డిసెంబర్‌లో టెండర్ ప్రక్రియ పూర్తయింది. జనవరి నుంచి కాంట్రాక్టర్ ద్వారా అమలులోకి వచ్చింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉంది. ఇల్లెందులోనే ఆలస్యంగా జరుగుతోంది.

–అంకుషావలీ, కమిషనర్, ఇల్లెందు మున్సిపాల్టీ

కలెక్టరేట్ ఎదుట నిరసన



ఐక్యవేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): దళితబంధు పథకం అమలులో జరిగిన లబ్ధిదారుల ఎంపికలో అనేక అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, అదే విధంగా ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలంలో లబ్ధిదారుని ట్రాక్టర్‌ను బలవంతంగా గుంజుకెళ్లిన అధికార పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, కోలా మల్లిక, కేతినేని కుమారి, బి.విజయ, కె.మర్దమ్మ, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ అరుణ భారతి

సుజాతనగర్: మూగ జీవాలను ప్రేమించడం.. వాటిపై మమకారం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణ భారతి అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతుహింస, జంతువుల పట్ల మెలగాల్సిన విధానాలపై విద్యార్థులకు సోమవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. మూగజీవాలపై క్రూరత్వం చూపడం నేటికీ కొనసాగుతోందన్నారు. ప్రతిఒక్కరూ జంతు సంక్షేమానికి పాటుపడాలని చెప్పారు. ఈ నెల 30 వరకు జంతు సంక్షేమ పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు. జంతువులను గాయపరచడం, ఎక్కువ బరువులు లాగించడం చట్టరీత్యా నేరమన్నారు. జంతువులను హింసిస్తే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జి.నాగులు, ఎస్‌ఐ పి.తిరుపతిరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీఎంఎస్ జెండా ఎగురవేస్తాం



యూనియన్‌లో చేరిన ఉద్యోగులతో బీఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, అధికారులు చేస్తున్న తప్పిదాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తేవటమే కాకుండా కార్మికుల పక్షాల నిలపడి నిరంతరం బీఎంఎస్ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై యూనియన్‌లో కార్మికులు యూనియన్‌లో చేరుతున్నారని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి జేబీసీసీఐ సభ్యులు పి.మాధవ నాయక్ అన్నారు. సోమవారం బీఎంఎస్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ యూనియన్ల నుంచి ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాపు, కిష్టారం ఓపెన్‌కాస్ట్, జేవీఆర్‌ఓ సీ ఆర్ సీహెచ్‌పీ, పీవీకే– షాఫ్ట్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌ల నుంచి సుమారు 35 మంది కార్మికులు, ఉద్యోగులు యూనియన్‌లో చేరారు. వీరికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల నిధులు రాబట్టేందుకు యూనియన్ అధినాయకులతో చర్చించి త్వరలో సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నామని చెప్పారు. రానున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ జెండాను ఎగురవేయటం ఖాయమన్నారు. కార్యక్రమంలో జీవీ కృష్ణారెడ్డి, టీఎస్ పవన్‌కుమార్, సంగం చందర్, టి.నరేంద్రబాబు, మొగిలిపాక రవి, ఊట్ల గణేష్, నాగేశ్వరరావు, డి. నిర్మల, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఎంపిక



ఎంపికలు నిర్వహిస్తున్న డీజీఎం పర్సనల్ కోదూరి శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 26న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సింగరేణి యాజమాన్యం నిర్వహించనున్న 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సాంస్కృతిక ప్రదర్శనల ఎంపికలను కార్పొరేట్ వెల్ఫేర్ డీజీఎం పర్సనల్ కోదూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వేడుకలకు సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.శ్రీధర్ హాజరుకానున్న నేపథ్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని, స్టేడియంలో ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించే విధంగా ఉండేలా ఈ ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైపీఎం ముకుంద సత్యనారాయణ, సీనియర్ పీఓలు బేతిరాజు, గట్టు స్వామి, ఎంసీ పాసినెట్, సీనియర్ స్కౌట్ లీడర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఏటీడీఓ రూపాదేవి

ఇల్లెందురూరల్: ఆంగ్లంపై ప్రతి విద్యార్థి పట్టు సాధించేలా బోధన చేపట్టాలని ఏటీడీఓ రూపాదేవి అన్నారు. మండలంలోని వైటీసీ భవన్‌లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా ఇంగ్లిష్ పాఠాలు బోధించేందుకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ఆటపాటలతో ప్రాథమిక విద్యాబోధన చేపట్టిన విధంగానే ఆంగ్ల బోధన చేపట్టాలని కోరారు. శిక్షణ శిబిరానికి 205 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

రైళ్లను పునరుద్ధరించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి కరోనా ముందు నడిచిన అన్ని రైళ్లను పునరుద్ధరించకపోతే రైలు రోకో తప్పదని కొదమ సింహం పాండురంగాచార్యులు అన్నారు. సోమవారం రైల్వే స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. బెళగావికు వేసిన స్పెషల్ ట్రైన్‌ని నడిపించాలని, లేకపోతే కొల్హాపూర్ రైలును ప్రవేశపెట్టాలన్నారు. ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని మెయిల్ ద్వారా రాష్ట్రపతికి, రైల్వే మంత్రికి, రైల్వే అధికారులకు వినతి పంపినట్లు వివరించారు. మూతి రామకృష్ణ, కంగాల రామకోటేశ్వరరావు, వజ్జా వీరభద్రం, వజ్జా చైతన్య కోయగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టు మృతికి సంతాపం



యతిరాజ్ (ఫైల్)

జూలూరుపాడు: గుండెపుడికి చెందిన జర్నలిస్టు కాశ్లూరి యతిరాజ్ కుమార్ (50) గుండెపోటుతో మృతి చెందారు. కొత్తగూడెం కేంద్రంగా ఓ చానల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని గుండెపుడి తరలించారు. కుమార్‌కు భార్య జ్యోతి, కుమారుడు ఉన్నారు. ఆయన సోదరుడు ప్రభాకర్‌రావు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు కుమార్ మృతి సమాచారం అందుకున్న పలువురు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రాములునాయక్, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మితోపాటు వివిధ పార్టీలు, జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు. సింగరేణి అధికారులు కూడా నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, కలెక్టర్ అనుదీప్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పట్టణంలో అమ్మవారి ఊరేగింపు

పాల్వంచ: ఆర్యవైశ్యుల కుల దైవం శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ సెంటర్ నుంచి లలిత కామేశ్వరి అమ్మవారి గుడి వరకు అమ్మవారి సేవాదళ్ సభ్యులచే పల్లకీలో అమ్మవారిని పాటలు, కీర్తనలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అష్టోత్తరములు జరిపించారు. ప్రమిదలతో 108 హోమ గుండాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆత్మగౌరవం కోసం అమ్మవారు హోమం గుండంలో ఆత్మార్పణ చేసుకుని, ఆర్యవైశ్యుల కుల దైవంగా మారిందన్నారు. కార్యక్రమంలో చలవాది ప్రకాష్, దోసపాటి వెంకటేశ్వరరావు, జూలూరి మల్లేష్, తాటికొండ సురేష్, శ్రీనివాస్, ఉమాశంకర్, మణి, దారా నరసింహారావు, దారం శ్రీనివాసరావు, కొప్పరపు వీరబాబు, దేవి ప్రసాద్, వంశీ, శివ, ప్రకాష్, సతీష్, రాజ్యలక్ష్మి, నిర్మల, తేజ, శారద, ఇందిర, నాగ హరీష, స్రవంతి పాల్గొన్నారు.

బాలికలను చదవనిద్దాం.. ఎదగనిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: ప్రస్తుత సమాజంలో బాలికలకు అన్ని అవకాశాలు కల్పించి వారు చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ సూచించారు. మండలంలోని నాగారం హైస్కూల్‌లో జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. బాలికల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారి అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. అనంతరం ఆమె రంగాపురం, నాగారంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సర్పంచ్ రాజా, హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు మాధవి, సునీత, చందు, హరి, వెంకటమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రప్రసాద్

పాల్వంచరూరల్: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందానికి చూపించి సహకరించాలని ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడారు.

2020 జనవరి 1 నుంచి 2022 మార్చి 31 వరకు మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.24.87 కోట్ల వ్యయం చేసి పనులు చేయడం జరిగిందని ఈ పనుల్లో కూలీలకు పని కల్పించడంతోపాటు చేసిన పనులను చూపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చేసిన ప్రతి పనిని సామాజిక బృందానికి చూపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ సాంబశివచారి, ఏపీఓ పోరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, డీఆర్పీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

పాల్వంచరూరల్: మహబూబాబాద్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జ్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి సహకార శాఖ సహాయ కేంద్ర మంత్రి బీఎల్.వర్మ భద్రాచలం వెళ్లి తిరిగి ఇల్లెందు మీదుగా సోమవారం మహబూబాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో పాల్వంచలో బీజేపీ నాయకులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలను విన్నవించారు.

కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కొనేరు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేతాజీ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ




ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాల్వంచ: నేటి యువత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ రంగా ప్రసాద్ అన్నారు. సోమవారం నేతాజీ జయంతి సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో నేతాజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ సోమరాజు దొర, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపకులు ఎస్‌జేకే అహ్మద్, సయ్యద్ అక్బర్, అబ్దుల్ రజాక్, స్టాలిన్, బాబర్, ఏజాజ్, అంజద్, సూరిబాబు, బొల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. యువతరం పార్టీ మండల అధ్యక్షుడు దాసరి శివరామకృష్ణ నటరాజ్ సెంటర్‌లో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి ఎంపీపీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రవీందర్, పద్మ, భద్రమ్మ, సుజాత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మరణం లేని వీరుడు సుభాష్ చంద్రబోస్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పోలారపు పద్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో నేతాజీ విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. మాట్లాడుతూ.. నేతాజీని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బిందుశ్రీ, అధ్యాపకులు శేఖర్, చెంచు రత్నయ్య, ఇంద్రాణి, శారద, పిచ్చయ్య, కిరణ్‌కుమార్, సురేంద్ర కుమార్, సరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో..

అటెన్షన్ ప్లీజ్

ప్రధాన రహదారిపై మురుగు నిల్వ..



టేకులపల్లి సెంటర్ ప్రధాన రహదారిపైనే మురుగు గుంత రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. తొమ్మిదో మైలుతండా నుంచి బొమ్మనపల్లి వరకు ప్రధాన రహదారి మార్గంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు ప్రధాన రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. ఇళ్లల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంట్లో, వీధుల్లో కాలువలు లేకపోవడంతో ప్రధాన రహదారి వెంబడి కొందరు మురుగు రాత్రి వేళల్లో రోడ్డుపైకి వదులుతుండటంతో మురుగు సమస్య మరింత పెరుగుతోంది. భారీ వాహనాలు ఈ గుంత్లో నుంచి వెళ్లినప్పుడు పాదచారులు, వాహనదారులపై పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : గణేష్ గాంధీ,
ఎంపీఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9948169879